క్లుప్తంగా

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా



వల్లూరు వద్ద బోల్తా పడిన ట్రాక్టర్

టంగుటూరు: లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మండలంలోని వల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీకాంత్ టంగుటూరు వైపు వస్తుండగా వల్లూరు సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ట్రాక్టర్ బోల్తా పడగా ముందు భాగం నుజ్జునుజ్జయింది. ట్రాక్టర్ డ్రైవర్ శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్సు సిబ్బంది ఎన్ని సార్లు ఫోను చేసినా స్పందించలేదని, చికిత్స కోసం ద్విచక్ర వాహనంపై ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి



ఆనికాలపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీచేస్తున్న తహసీల్దార్

సీఎస్‌పురం(పామూరు): పెట్రోల్, డీజిల్ పంప్ డీలర్లు నిబంధనలు అనుసరించి వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలుందించాలని తహసీల్దార్ షేక్.మహ్మద్ హుస్సేన్ అన్నారు. స్థానిక భారత్ పెట్రోల్ బంక్‌ను బుధవారం తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెట్రోల్, డీజిల్‌లో నాణ్యతను పరిశీలించి, రికార్డులు పరిశీలించి ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా వాహనదారులకు పెట్రోల్, డీజిల్‌ను అందించాలన్నారు. ఆనికాలపల్లి, శీలంవారిపల్లె గ్రామాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించి రేషన్ పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆనికాలపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం



మాట్లాడుతున్న కమిషనర్, పక్కన చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పట్టణ ప్రణాళికా విభాగం, రియల్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్ పథకాన్ని బిల్డర్, రియల్టర్లు సద్వినియోగం చేసుకోని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్రయ, విక్రయాలకు ఇబ్బందులు పడుతున్న లే అవుట్ల యజమానులతో పాటు, వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసుకున్నవారు క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. 2025 జూన్ 30 లోగా అనధికార లే అవుట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులైజేషన్ చేసుకోవడానికి మరోసారి అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2025 అక్టోబర్ 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా వెంచర్లు వేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సువర్ణకుమార్ మాట్లాడుతూ దరఖాస్తుదారులు పురపాలక శాఖ నిబంధనలకు అనుగుణంగా తమ ప్లాట్లను రెగ్యులైజేషన్ చేసుకునేందుకు పటిష్టమైన ఆధారాలు పురపాలక శాఖ వెబ్‌సైట్‌లో లేదా టౌన్ ప్లానింగ్ విభాగంలో, మున్సిపల్ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ను సంప్రదించాలని తెలిపారు. ఎల్బీపీ రంగారావు, రియల్టర్ వ్యాపారులు, మున్సిపల్ సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అభినందనలు

టంగుటూరు: జాతీయ రహదారి-16 వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాల శుభ్రపరిచే డ్రైవ్, టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించిన సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ చొరవను రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు బుధవారం అభినందించి పత్రం అందించింది. 300 మంది పాల్గొని పర్యావరణ పరిరక్షణ, ప్రజాసంక్షేమంపై నిబద్ధతను ప్రతిబింబిస్తోందని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు పేర్కొన్నారు. పరిశుభ్రమైన, పచ్చటి వాతావరణాన్ని సృష్టించడంలో మీ ప్రయత్నాలు గణనీయంగా దోహదపడ్డాయని, ఇటువంటి కార్యక్రమాలు ఇతరులు అనుసరించేందుకు ప్రశంసనీయమైన ఉదాహరణగా నిలుస్తాయన్నారు. భవిష్యత్‌లో పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల్లో సహకరించాలని కోరారు. ఒంగోలు పీఐయూలోని ఎన్‌హెచ్‌ఐ పీడీ అనిల్‌కుమార్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎస్‌సీఎల్ ప్రాజెక్ట్ హెడ్ శ్రీ జైరాం అమర్బాబు, ఎల్ఎస్ మాలవీయ టీమ్ లీడర్ సురేష్‌బాబు నాయకత్వంలో ప్లాస్టిక్ వ్యర్థాల శుభ్రపరచడం, మొక్కల పెంపకంపై డ్రైవ్ నిర్వహించారు.

ఎస్సీ కాలనీలో సమస్యల తిష్ట

- పాత సింగరాయకొండ ఎస్సీ కాలనీ అధ్వానం
- పడకేసిన పారిశుధ్యం, వెలగని వీధిలైట్లు
- కాలువల్లో కదలని మురుగు నీరు
- దోమల బెడదతో అల్లాడుతున్న ప్రజలు
- రోడ్ల పక్కన పెరిగిన చిల్లచెట్లు
- మూతబడిన పంచాయతీ వాటర్‌ప్లాంట్
- అరకొరగా రక్షిత మంచినీటి సరఫరా



ఎస్సీ కాలనీలో వెలగని వీధిలైట్లు



కాలువల్లో కదలని మురుగునీరు

సింగరాయకొండ: మండలంలోని పాత సింగరాయకొండ పంచాయతీ ఎస్సీ కాలనీ వాసులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో సుమారు 250 గృహాలు ఉన్నాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలువల్లో మురుగు పేరుకుపోయి పారే వీల్లేక పోవడంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోంది. రక్షిత మంచినీటి పథకంతో రోజు మార్చి రోజు కేవలం 25 నిమిషాల పాటు నీరు సరఫరా చేస్తుండటంతో వాటర్ ట్యాంకు సమీపంలోని వారికి నీరు సరిపోతుండగా దూరంగా ఉన్న గృహాల వారికి వాడుక నీరు బోర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఉంది. కాలువల్లో మురుగు కారణంగా దోమల బెడద అధికంగా ఉంది. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లి దాదాపు సంవత్సరమైంది. ఎస్సీ కాలనీలు అంటే అంత చిన్నచూపా..అని కాలనీ వాసులు పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూతబడిన వాటర్ ప్లాంట్

గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పంచాయతీ వాటర్ ప్లాంట్ మూతబడింది. ప్లాంట్ వద్ద 20 లీటర్ల బబుల్ వాటర్ 10 రూపాయలకు అందించే వారు. చాలా రోజులుగా ప్లాంట్ మూతబడటంతో ఇతర ప్రైవేటు వాటర్‌ప్లాంట్లకు చెందిన ఆటోలు వద్ద 20 లీటర్ల క్యాన్ 15 రూపాయలకు పట్టుకుంటామని ప్రజలు పేర్కొంటున్నారు. ప్లాంట్ మూతబడి సుమారు 8 నెలలు గడుస్తున్నా పట్టించుకున్న అధికారి లేడని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్‌ప్లాంట్‌కు రంగు మార్చి పచ్చరంగు వేయడంలో చూపించిన శ్రద్ధ ప్లాంట్ పనిచేయించడంలో కూటమి నాయకులు చూపలేదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ

కాలనీలో వీధిలైట్లు వెలగక పోవడంతో రాత్రి పూట కాలనీ అంధకారంలో ఉంటోందని వాపోతున్నారు. వీధిలైట్లు వేయమని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఎటువంటి ప్రయోజనం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్ల పక్కన పిచ్చి చెట్లు పెరిగాయని, వాటిలో విషపురుగులు చేరుతున్నాయని, రాత్రి పూట రోడ్డుపై నడవాలంటేనే భయంగా ఉందని, వీధిలైట్లు ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కలగా మారిన రామతీర్థం నీరు

పాత సింగరాయకొండ గ్రామ పంచాయతీకి రామతీర్థం నీరు వస్తుందే తప్ప ఎస్సీ కాలనీకి మాత్రం రావడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామతీర్థం పైపులైను కాలనీ వరకు ఏర్పాటు చేస్తే తాగునీటి సమస్య తీరుతుందని, కూటమి ప్రభుత్వ నాయకులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో మూతబడిన పంచాయతీ వాటర్‌ప్లాంట్



రోడ్డు పక్కన పెరిగిన పిచ్చిచెట్లు

> **పారిశుధ్యం అధ్వానంగా ఉంది:**
> 
> గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలువల్లో మురుగు తీసి రోడ్లు చిమ్మి నెలలు దాటింది. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర.. అని ప్రకటనలు తప్ప ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. కాలనీలో దోమల బెడద అధికంగా ఉంది.
> – దన్నాసి ప్రభాకర్, ఎస్సీ కాలనీ, పాత సింగరాయకొండ

> **ప్లాంట్ మూతబడి ఎనిమిది నెలలు:**
> 
> కాలనీలో పంచాయతీ వాటర్ ప్లాంట్ మూతబడి దాదాపు 8 నెలలైంది. బయట నుంచి ఆటోలు వస్తేనే మాకు తాగునీరు. రామతీర్థం పైపులైను కాలనీ వరకు వేస్తే తాగునీటి సమస్య తీరుతుంది. వీధిలైట్లు వెలగటం లేదు. చిన్నగాలి వీచినా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.
> – దాసరి శ్రీను, ఎస్సీ కాలనీ, పాత సింగరాయకొండ

ఈవీఎంల ముఖ్యమంత్రి మాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సురేష్

మర్రిపూడి: ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిందని, ఈవీఎంల ముఖ్యమంత్రి మాటలు ఎవరూ నమ్మొద్దని వైఎస్సార్ సీపీ కొండపి సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని చిమటలో బుధవారం బాబు షూ్యరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలు నమ్మిన మహిళలను నట్టేట ముంచారన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం కూటమి నేతలకు అలవాటుగా మారిందన్నారు. ఏరు దాటకముందు ఓడ మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న అన్న చందాగా కూటమి ప్రభుత్వ పాలన ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిపోతున్నా ఏ ఒక్క హామీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. తహసీల్దార్ కార్యాలయాలు తెలుగుదేశం పార్టీ నేతలకు నిలయాలుగా మారాయని మండిపడ్డారు. పచ్చ నేతల కను సన్నల్లో భూదందాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పశువుల బీడు భూములను సైతం యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారన్నారు. పోరంబోకు భూముల్లో అక్రమ కట్టడాలు కట్టడం అధికారులను అడ్డుపెట్టుకుని భూములను ఆన్‌లైన్ చేయడం అన్యాయమన్నారు. ఇందుకు మంత్రి అండదండలు మెండుగా ఉన్నాయన్నారు. పేదల కడుపు మాడితే రాబోవు రోజుల్లో ఏం జరుగుతుందో మీరే చూస్తారని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఎలాంటి మీటింగులు పెట్టుకున్నా లేదా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నా అనవసరపు రాద్ధాంతాలు, అలజడులు, అరాచకాలు సృష్టిస్తున్న ఈ నాయకత్వాన్ని ఎలా సాగనంపాలో ప్రజలకు తెలుసన్నారు. నీకు రూ.15 వేలు, మీకు 18 వేలు అంటూ ఆడపడుచులను మభ్య పెట్టారని, వారి ఉసురు తగులుతుందన్నారు. వృద్ధులు, వితంతులకు పింఛన్ ఇవ్వకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కుల,మత ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా పనులు చేశారని గుర్తు చేశారు. రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని మాజీ మంత్రి సురేష్ గుర్తు చేశారు. మిర్చి రైతులు అలాగే పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. మిరపకాయలు క్వింటా రూ 11000 లకుకొనే దిక్కు లేదన్నారు. పొగాకు ధర క్వింటా రూ.20 వేలు కూడా కొనుగోలు చేయకపోతే రైతులు ఎలా పంట సాగు చేసుకుంటారని ప్రశ్నించారు. అమ్మకానికి వెళ్లిన పొగాకు బేళ్లు తిరుగుముఖం పడుతున్నాయని, పొగాకు రైతుల మోములో ఎలాంటి ఆనందం లేదంటూ ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు. పార్టీ కోసం అందరం కలిసికట్టుగా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మంచం పట్టిన జువ్విగుంట గ్రామానికి చెందిన కముజుల రమణారెడ్డిని ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. కార్యక్రమంలో మాకినేని వెంకట్రావు, బొల్లినేని నాగేశ్వరరావు, పెట్లూరు కృష్ణమూర్తి, దిండు నరసింహారావు, కొండ్రు ఇజ్రాయేల్, మాకినేని హరీష్, పులిచెర్ల రామిరెడ్డి, ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, సింగారెడ్డి, ఎం.కోటేశ్వరరావు, సీహెచ్ కోటేశ్వరరావు, సీహెచ్ రోశిరెడ్డి, మాలకొండయ్య, వెలుతుర్ల ముసలారెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

టంగుటూరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం టంగుటూరులోని పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కార్డెన్ సెర్చ్‌లో 400 గృహాలను తనిఖీ చేసి అనుమానాస్పద వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఎటువంటి పత్రాలు లేని దాదాపు 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా పత్రాలతో పాటు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగంతో వాహనాన్ని నడపాలని, మద్యం తాగి వాహనాన్ని నడిపితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. పేకాట, అక్రమ మద్యం, గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి తెస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీజైన వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించి వాటిని తీసుకెళ్లవచ్చని చెప్పారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రతినెలా ఇదే విధంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో 9 మంది ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బందితో పాటు దాదాపు 72 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కొండపిలో అందుబాటులోకి పోస్టుమార్టం సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ సూరిబాబు, పక్కన డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస నాయక్

కొండపి: నియోజకవర్గ కేంద్రం కొండపి క్లస్టర్ హెల్త్ సెంటర్లో బుధవారం నుంచి పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీహెచ్‌ఎస్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పర్యవేక్షణలో పోస్టుమార్టం ప్రారంభించామన్నారు. మంగళవారం బావిలో పడి మృతి చెందిన జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామ వాసి మారంరెడ్డి రామకృష్ణారెడ్డి (37) మృతదేహానికి డాక్టర్ పరిమళ పోస్టుమార్టం చేశారని చెప్పారు. పోస్టుమార్టం కోసం ఇక నుంచి ఒంగోలు రిమ్స్‌కి వెళ్లాల్సిన పని లేకుండా కొండపిలోనే పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. డాక్టర్ గీత, ఏఎస్ఐ అంకారావు, కానిస్టేబుళ్లు అనిల్, కిరణ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్, చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డిలతో పాటు మరి కొందరు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్జల వెంకటరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కేలం రాజశేఖరరెడ్డి, తాతపూడి సురేష్, సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, పాపాబత్తిన నాగేశ్వరరావు, సైకం వెంకటేశ్వరరెడ్డి, మారం రవీంద్రారెడ్డి, కలికాయ నారాయణ, రాగిపిండి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



ర్యాలీ చేస్తున్న ఎంఈఓ

పామూరు: మానవ అక్రమ రవాణా పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో బుధవారం మానవ అక్రమరవాణా నియంత్రణపై అవగాహన సదస్సు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ కరుణ కుమారి మాట్లాడుతూ ఆర్థిక ప్రయోజనాలకోసం మనుషులను అంగడి సరుకులుగా మార్చి క్రయ విక్రయాలు చేయడం అత్యంత దుర్మార్గమైన, హేయమైన చర్య అన్నారు. సంస్థ అధ్యక్షుడు నాయబ్‌రసూల్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఆర్థిక అసమానతలు లేకుండా చూడాలని, పేదరికం నుంచి విముక్తి కల్పించేందుకు స్వయం ఉపాధి కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నుంచి ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు.

కనిగిరిరూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అందరూ భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ గఫార్, ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, వివిధ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ నివారణకు, అరికట్టేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏఎస్ఓ పిల్లి వెంకట రమణారెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, ఎలీషా, నవకుమార్, పవన్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రైతులకు విరివిగా రుణాలు



ఎస్‌బీఐ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆర్ఎం అప్పలరాజు

కొండపి: రైతుల ఆర్థికాభివృద్ధి కోసం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో వారికి విరివిగా రుణాలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు కందుకూరు ఆర్ఎం వి.అప్పలరాజు అన్నారు. బుధవారం స్థానిక టంగుటూరు రోడ్డు పక్కన స్టేట్ బ్యాంక్ నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొండపి స్టేట్ బ్యాంక్‌లో 1800 రైతులకు పంట రుణాలు అందించామన్నారు. 256 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయన్నారు. వారి ఆర్థిక అభివృద్ధికి తమ బ్యాంకు చేయూతనిస్తోందని తెలిపారు. అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకంలో రైతులందరూ ట్రాక్టర్లు, అనుబంధ యంత్రాలు, డ్రోన్లకు రుణాలు ఇస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఎం కార్యాలయం మేనేజర్ హెచ్ఆర్ శ్రీనివాస్ నాయక్, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనివాసరావు స్టేట్ బ్యాంక్ కొండపి బ్రాంచ్ మేనేజర్ శరత్, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, స్టేట్ బ్యాంక్ భవన నిర్మాణాల స్థలం యజమానులు గుంటుపల్లి మధన్, ఝాన్సీ పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలకు వితరణ



బీరువా, కుర్చీలు అందజేస్తున్న విజయభాస్కరరెడ్డి

కనిగిరిరూరల్: ఎస్‌కేఆర్ దివ్యాంగుల పాఠశాలకు చిట్యాల వెలుగొండారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి బుధవారం సుమారు రూ.70 వేల విలువైన వస్తువులను అందజేశారు. విజయ భాస్కర్‌రెడ్డి తన ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలకు కుర్చీలు, బీరువా, ఇతర వస్తువులు అందచేసి అనంతరం చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. తొలుత స్థానిక పార్టీ నాయకులతో కలిసి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ అత్యాల జఫన్య, ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి, మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, తడికమళ్ల వెంకటేశ్వర్లు, పులి రమేష్, సానికొమ్ము శ్రీనివాసులరెడ్డి, భవనం కృష్ణారెడ్డి, గురు ప్రసాద్, మహబూబ్ బాషా, వెంకటేశ్వర రెడ్డి, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న తిరస్కరణ బేళ్లు



వేలాన్ని పరిశీలిస్తున్న సునీల్‌కుమార్

- ఒకే రోజు 311 పొగాకు బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక వేలం కేంద్రం పరిధిలో బుధవారం నిర్వహించిన వేలంలో 311 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. రోజురోజుకూ బేళ్లు తిరస్కరణకు గురవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ధరలు లేక నానా ఇబ్బందుకు పడుతుంటే వాటికి తోడు తిరస్కరణలు ఎక్కువ ఉన్నా పొగాకు బోర్డు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 963 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 652 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 311 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలకగా సరాసరి రూ.223.92 ధర పలికింది. వేలంలో మొత్తం 33 మంది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

242 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 242 బేళ్లు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, వెంకటకృష్ణాపురం, కోయవారిపాలెం, తాటాకులపాలెం, ముక్కోడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 987 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 745 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 242 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.281, కనిష్ట ధర కేజీ రూ.159, సరాసరి ధర కేజీ రూ.252.95గా నమోదైంది. వేలంలో 23 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగస్వామ్యం కావాలి

టంగుటూరు: కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు ఆగస్టు 3న ప్రారంభించబోయే రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ప్రధాన ఉద్దేశం దళితులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ, ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకిస్తూ, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్సీ జనాభా పెరిగిందానికి అనుగుణంగా 20 శాతం రిజర్వేషన్ పెంచాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అంబేడ్కర్ మాటలను ఆచరణలో పెడుతూ పే బ్యాక్ టు ది సొసైటీ అనే నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపడుతున్నట్లు అశోక్‌బాబు తెలిపారు.